సాక్షి
అనంతపురం
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024

జన సునామీ





రాప్తాడు వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- దద్దరిల్లిన రాప్తాడు
- సీమవాసుల సమరోత్సాహం
- మార్మోగిన జగన్నినాదం
- అడుగడుగునా నీరాజనం
- అంచనాలకు మించి తరలివచ్చిన జనం
- సీఎంతో జతకలిసిన లక్షలాది గొంతుకలు
- ఎన్నికలకు 'సిద్ధ'మని ఆకాశాన్నంటేలా గళం
- 'వై నాట్ 175' అని నినదించిన వైనం
- 'సిద్ధం' సభ విజయవంతం

రాప్తాడులో జన సునామీ ఎగసిపడింది. సంక్షేమ ప్రదాతను చూసి ఉప్పొంగి పోయింది. అభిమాన నాయకుడితో జతకలిసింది. జయహో జగన్ అంటూ మార్మోగించింది. మా నమ్మకం నువ్వేనంటూ హోరెత్తించింది. ప్రతిపక్షాలకు వణుకు పుట్టించేలా రణ నినాదం చేసింది. వై నాట్ 175 అంటూ నలుదిక్కులా నినదించింది. పెత్తందారులతో పోరుకు 'సిద్ధం' అని ప్రకటించింది. ప్రతిపక్షాల నక్కజిత్తులను చిత్తు చేస్తామని స్పష్టం చేసింది. వైఎస్సార్ సీపీ శ్రేణులను సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.



ఆనందం: మనవడిని చూసి చేయి ఊపుతూ మద్దతు తెలుపుతున్న వృద్ధురాలు

అనంతపురం: ప్రతి పేద బాగుండాలని పరితపించారాయన. ఎక్కడా అవినీతికి తావులేకుండా ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేశారాయన. పార్టీలు, కులాలు, మతాలు అనే తేడా లేకుండా కోట్లాది మందికి మేలు చేకూర్చాయన. మరి అలాంటి వ్యక్తి స్వయంగా తమ ప్రాంతానికే వస్తే ఇంకేమైనా ఉందా. అభిమానం తరంగమైపోదూ! సరిగ్గా అదే జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం మోగిస్తూ రాప్తాడులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అతి పెద్ద ప్రజా సభకు రాప్తాడు వేదికైంది. సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు పార్టీ శ్రేణులే కాకుండా జనం భారీగా తరలివచ్చారు. సునామీని తలపించారు. అంతులేని అభిమానాన్ని చాటారు. తండోపతండాలుగా వచ్చిన జనసందోహంతో సభా స్థలం కిక్కిరిసిపోయింది. ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు ఇంత పెద్ద స్థాయిలో జనం పోటెత్తడం బహుశా ఇదే ప్రథమం!

మండుటెండను సైతం లెక్కచేయకుండా..

రాయలసీమ పరిధిలోని 52 అసెంబ్లీ నియోజక వర్గాలు, 7 పార్లమెంట్ నియోజక వర్గాల నుంచి వందలాది బస్సులు, వేలాది వాహనాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అభిమాన నేత రాక కోసం ఎదురు చూశారు. 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా స్థలం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకే జనంతో నిండిపోయింది. దీంతో చాలామంది జాతీయ రహదారిపై నిల్చొనే సీఎం ప్రసంగాన్ని విన్నారు. వచ్చిన వారికి అసౌకర్యం కలగకుండా గ్యాలరీల వద్ద చల్లని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచారు.

నడిచొచ్చి.. ఉత్సాహం నింపి

మధ్యాహ్నం 3.40 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం జగన్ వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా స్థలం మొత్తం కవర్ చేస్తూ ఫ్యాన్ ఆకారంలో ఏర్పాటు చేసిన వాక్ వే వద్దకు చేరుకున్నారు. 10 నిమిషాల పాటు ప్రజలందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగి ఉత్సాహం నింపారు. అభిమాన నేతను దగ్గర నుంచి చూసిన పార్టీ శ్రేణులు మురిసిపోయాయి.



మీరే నా సైన్యం: ప్రజలకు అభివాదం చేసుకుంటూ వాక్‌వేపై వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పంచ్ డైలాగ్‌లతో దద్దరిల్లిన సభ

సీఎం జగన్ తన ప్రసంగంతో శ్రేణులను హోరెత్తించారు. దాదాపు 75 నిమిషాల పాటు ప్రసంగించిన ఆయన.. గత 57 నెలల్లో పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలను వివరించారు. మధ్యమధ్యలో పదునైన పంచ్ డైలాగ్‌లతో అందరినీ ఆకట్టుకున్నారు. 'విశ్వసనీయతకు, వంచనకు మధ్య జరుగుతున్న యుద్ధం.. 'సీమ'లో సముద్రం లేకపోవచ్చు.. కానీ నేడు రాప్తాడులో జన సముద్రం చూడొచ్చు.. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లో తిరుగుతూ ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయట ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లో ఉండాలి'' అంటూ ఆయన పేల్చిన పంచ్ డైలాగ్‌లకు లక్షలాది గొంతుకలు అనుకూలంగా ప్రతిధ్వనించాయి. ''చొక్కా మడతేసి.. బాబు కుర్చీని సైతం మడతేసి చీపురుతో ఊడ్చి వాళ్ల పార్టీని మడతేయడానికి సిద్ధంగా ఉన్నారా?' అని సీఎం జగన్ అన్నప్పుడూ 'మేమూ సిద్ధమే' అంటూ గొంతెత్తారు. ముఖ్యమంత్రి ప్రసంగించినంత సేపూ ఈలలు, చప్పట్లతో మద్దతు పలికారు. సీఎంగా 14 ఏళ్లు పనిచేసిన బాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయకపోగా అవినీతి, అభూత కల్పనలతో పాలన సాగించారని విమర్శించినపుడు 'నిజం' అంటూ ప్రజలు మద్దతు తెలిపారు. పెత్తందార్లు, పేదవారికి మధ్య జరిగే యుద్ధానికి 'సిద్ధమా' అని సీఎం జగన్ అన్నప్పుడు 'సిద్ధం' అంటూ నినదించారు.



ఒకటే లక్ష్యం : సభా స్థలం కిక్కిరిసిపోవడంతో రహదారిపైనే నిల్చుని సీఎం ప్రసంగం వింటున్న జనం





మేమూ నీవెంటే: ముఖ్యమంత్రిని చూసిన ఉత్సాహంలో వృద్ధులు

- అభిమాన నేతను చూసేందుకు జనం ఎగబడటంతో పలు బారికేడ్లు పడిపోయాయి. పోలీసులు వారిని అదుపుచేయడం కత్తిమీద సాములా మారింది. ఇంకొంతమంది అయితే సీఎంను చూసేందుకు లైట్లు, స్పీకర్ల స్టాండ్లు ఎక్కారు. మరికొందరు బ్యానర్లు కట్టిన కట్టెల సాయంతో పైకి ఎక్కి ముఖ్యమంత్రిని చూసి మురిసిపోయారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

'సిద్ధం'ను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువకులు తీన్‌మార్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. సీఎం జగన్ పాలనలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని ప్రముఖ కళాకారులు కళ్లకు కట్టారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు నారాయణ స్వామి, అంజాద్ బాషా, ఉషశ్రీ చరణ్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే అన్నా: కటౌట్ పట్టుకుని జగన్నినాదం చేస్తున్న యువతి



సై : సమరానికి సిద్ధమంటున్న అభిమాని



నాన్న స్మృతిలో : వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా...

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడు 'సిద్ధం' సభలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఇలా సాగింది. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్టర్ రాప్తాడు సమీపంలోని సభా వేదిక వద్దకు వచ్చింది. వేదిక చుట్టూ ఒక రౌండు తిరిగిన అనంతరం 3.35 గంటలకు కిందకు దిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3.50 గంటలకు సభ వేదికపైకి వచ్చారు. వేదికపై కూర్చున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఒక్కొక్కరినీ పలకరించారు. 3.55 గంటలకు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదికపై నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేశారు. సాయంత్రం 4.10 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభమైంది. 5.20 గంటలకు ప్రసంగం ముగించారు.



కదిలింది జన కదలి : రాయలసీమ నలువైపుల నుంచి తరలివచ్చిన జనవాహిని

జనం మెచ్చిన నేత జగన్

కనగానపల్లి: పారదర్శక పాలన.. ముంగిటకే ప్రభుత్వ సేవలతో జనం మెచ్చిన నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. పేదల సొంతింటి కల సాకారం, ప్రభుత్వ విద్యారంగ పటిష్టత, డిజిటల్ బోధన- అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకునే విధంగా పాఠ్యాంశాలు, కోర్సుల రూపకల్పన, గ్రామస్థాయిలోనే సచివాలయ-వలంటీర్ వ్యవస్థతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు తీసుకొచ్చారు. అవినీతికి తావులేకుండా, కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. అది కూడా క్యాలెండర్ ప్రకటించి.. అందుకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. ఇలాంటి సుపరిపాలనే కొనసాగాలని 'సిద్ధం' బహిరంగ సభకు వచ్చిన వారు ముక్తకంఠంతో కోరారు.

మనసున్న మారాజు జగన్



అన్ని వర్గాల ప్రజల కష్టనష్టాలను దగ్గరగా చూసిన జగన్ వారిని ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. గతంలో వైఎస్సార్ ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మళ్లీ అటువంటి పథకాలను జగన్ అమలు చేస్తున్నారు. మనసున్న మారాజు జగనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– ఫక్రుద్దీన్, అనంతపురం

టీడీపీని నమ్మే పరిస్థితిలో లేరు



ఓట్ల కోసం హామీలు ఇస్తారు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు మాట ఇచ్చి తప్పడం పరిపాటిగా మారింది. టీడీపీని నమ్మే పరిస్థితిలో ప్రజలు ఎవ్వరూ లేరు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోంది. మాట ఇచ్చాడంటే నెరవేరుస్తాడంతే. మళ్లీ జగనే సీఎం అవుతారు.

– పడిగోల, పెద్దవడుగూరు, తాడిపత్రి

కడుపునిండా తింటున్నాం



జగన్ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే మాలాంటి వృద్ధులు మూడు పూటలా భోజనం తింటున్నాం. జగన్ వచ్చిన తర్వాత వలంటీర్లు ఒకటో తేదీ ఉదయం ఇంటి దగ్గరికే వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండాలి.

– పోతన్న, రాప్తాడు

జనం మద్దతు జగన్‌కే



మాలాంటి పేద ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగాలి. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎన్ని కుట్రలు చేసినా జనం మద్దతు మాత్రం జగనేకే ఉంటుంది. మరోసారి సీఎం కావటం ఖాయం.

– నారాయణస్వామి, అనంతపురం

జగనన్నతోనే అభివృద్ధి



జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కుటుంబాలతో పాటు గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయి. నవరత్నాలు పథకాలతో పేదలందరికీ మేలు జరిగింది. గ్రామాల్లోనే ప్రభుత్వ ఆఫీసులు పెట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఇది చాలా మంచి పాలన.

ఆదెప్ప, పెదపప్పూరు

బాబు మాటలన్నీ అబద్ధాలే



అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు కోతలు కోస్తారు. ఆయన చెప్పే మాటలన్నీ అబద్ధాలే. 14 ఏళ్ల పాలనలో ఆయన ప్రజలకు చేసింది శూన్యం. మాట నిలుపుకోలేని బాబును ఎప్పటికీ నమ్మలేం. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన తర్వాత అంతకు మించిన సంక్షేమ పాలనను అందించినది జగనే.

– ప్రకాష్‌రెడ్డి, చింతలచెరువు,



సిద్ధం సభలో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వేదికపై ప్రజాప్రతినిధులు, నేతలు



అదిగో జగనన్న: రాప్తాడు గగన వీధుల్లో హెలికాప్టర్ కనిపించడంతో కేకలు వేస్తున్న అభిమానులు



హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటున్న సీఎం హెలికాప్టర్



వన్స్‌మోర్ జగనన్న అంటున్న యువకుడు

రాప్తాడులో సింహగర్జన

258 ఎకరాల సువిశాల మైదానం.. 18 ఎకరాల్లో ఏర్పాటు చేసిన భారీ సభా వేదిక.. ఇసుక వేస్తే రాలనంత జనం.. భానుడి ప్రతాపాన్ని సైతం లెక్క చేయకుండా పోటెత్తిన అభిమానం.. వెరసి రాప్తాడు జన ఉప్పెనగా మారింది. అనంతపురం జిల్లా రాప్తాడు కేంద్రంగా నిర్వహించిన రాయలసీమ స్థాయి ఎన్నికల శంఖారావం సభ 'సిద్ధం' విజయవంతమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జనం పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచే 44వ జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజల వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను తూచ తప్పకుండా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్లు, అనంతపురం



భళిరా.. భళిరా: పాటలు పాడుతున్న సినీ గాయకులు



దరువెయ్: జానపద కళాకారుల ప్రదర్శన



చిందెయ్: సంతోషంతో నృత్యం చేస్తున్న మహిళ



సిద్ధం: వైఎస్ జగన్ మాస్క్‌లతో యువకుల సందడి



బారికేడ్లపై నిలబడి సీఎం ప్రసంగం వింటున్న జనం



తగ్గేదేలా: యువకుల బైక్ ర్యాలీ



కదిలింది మహిళాలోకం: వైఎస్సార్‌సీపీ గొడుగులతో ర్యాలీగా వస్తున్న మహిళలు



వేడుక చూద్దాం: కటౌట్ ఎక్కి సీఎం వైఎస్ జగన్ ప్రసంగం వింటున్న ప్రజలు



నేను సైతం: సిద్ధం సభకు తరలివస్తున్న దివ్యాంగుడు



జై జగన్: సిద్ధం కటౌట్‌లతో వస్తున్న మహిళలు



ముఖచిత్రం: పార్టీ జెండాను చిత్రీకరించుకుంటున్న అభిమాని



చెరిగిపోని అభిమానం: ఎన్నికలకు మేమూ సిద్ధమంటూ ముద్ర వేయించుకున్న యువత

భక్తజనసంద్రమైన కోటంక





ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

- ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం భక్తజనసంద్రమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ప్రధాన అర్చకుడు రామాచార్యులు నేతృత్వంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని 108 శివలింగాలను భక్తులే స్వయంగా పూజలు చేశారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణతో ఆలయం శోభాయమానంగా వెలుగులీనింది. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు అన్ని చర్యలూ తీసుకున్నారు. అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

బైక్‌నే ప్రచారరథంగా మార్చి...

- జగనన్న కోసం ఓ ఉద్యోగి ప్రచారం



ప్రచార రథంపై అమరనాథ్ రెడ్డి

రాప్తాడు: తన జీవితం జగనన్నకే అంకితం అంటున్నాడు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేటకు చెందిన రామిరెడ్డి అమరనాథ్ రెడ్డి. ఈయనకు ముఖ్యమంత్రి అంటే పంచ ప్రాణాలు. విశాఖ శివారు దువ్వాడ ఫార్మాసిటీలోని లీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో 11 ఏళ్లుగా క్వాలిటీ విభాగంలో పనిచేస్తూ గాజువాకలో ఉంటున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించినందున రూ.40 వేల వేతనం వచ్చే ఉద్యోగాన్ని సైతం వదిలేసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటూ ప్రతి గ్రామం, వీధిలో ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం తన ద్విచక్ర వాహనాన్నే ప్రచార రథంలా మార్చేశారు. వాహనానికి ఇరువైపులా 'బలవంతుడికి...బలహీనుడికి జరిగే యుద్ధం' అనే స్టిక్కర్ అతికించుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు హెల్మెట్‌కు కూడా ప్రచార నిమిత్తం స్టిక్కరింగ్ చేయించుకున్నారు. అమరనాథ్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లోనూ జగన్ కోసం ప్రచారం చేశారు. ప్రస్తుతం కూడా తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు వీలుగా తన భార్య మనోజ్ఞ, ఏడాది పాప నివేదితా రెడ్డిని గుంటూరులోని అత్తారింట్లో వదిలి పెట్టినట్లు అమరనాథ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు తాను ప్రచారంలో పాల్గొంటానన్నారు. జీవితాంతం జగనన్నతోనే తన ప్రయాణం అంటూ ఉద్వేగభరితంగా చెప్పారు.

ఘనంగా గుంతకల్లు రైల్వేస్టేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న సీనియర్ డీఓఎం శ్రవణ్‌కుమార్

గుంతకల్లు టౌన్: భారతీయ రైల్వేలోనే ఘనమైన చరిత్ర కలిగిన గుంతకల్లు రైల్వేస్టేషన్ 158వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్టేషన్ మొదటి ఫ్లాట్‌ఫారమ్‌పై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఓఎం శ్రవణ్‌కుమార్, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జార్జ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఉద్యోగులకు, కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, సమైక్యతకు రవాణా, సమాచార వ్యవస్థలే కీలకమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో, సరుకు రవాణాలోనూ గుంతకల్లు రైల్వే స్టేషన్ సాధించిన ప్రగతిని కొనియాడారు. అనంతరం రైల్వే విశ్రాంత ఉద్యోగులు పలువురిని సన్మానించారు.

21 నుంచి 'జగనన్న పాలవెల్లువ'

- జేసీ కేతన్‌గార్గ్, జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: అమూల్ భాగస్వామ్యంతో ఈ నెల 21 నుంచి జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దళారీ వ్యవస్థను రూపుమాపి నాణ్యతను బట్టి గరిష్ట ధర చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలి విడతగా అనంతపురం, బుక్కరాయసముద్రం, రాప్తాడు, నార్పల, ఆత్మకూరు మండలాల్లో పాలసేకరణ మొదలవుతుంది. 53 ఆర్‌బీకేల పరిధిలో 98 గ్రామాల్లో ఇప్పటికే మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్ల ద్వారా పాల నాణ్యతను కొలిచే యంత్రాలు, అధునాతన బిల్లింగ్ వ్యవస్థతో కూడిన పరికరాలు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు అందుబాటులోకి తీసుకు వచ్చారు.

జొన్నసొప్ప తిని 62 గొర్రెల మృతి

ఉరవకొండ/విడపనకల్లు: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి, కరకముక్కల గ్రామాల మధ్యలో ఆదివారం జొన్న సొప్ప తిన్న 62 గొర్రెలు మృతి చెందాయి. తీవ్ర అస్వస్థతకు లోనై మరో 38 గొర్రెలను వైద్యాధికారులు కాపాడారు. వివరాలు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన చిన్న నారాయణనాయక్, కుళ్లాయప్పనాయక్ గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తమ జీవాలను మేపునకు కొట్టాలపల్లి శివారులోకి తీసుకెళ్లారు. ఆ సమయంలో విషపూరిత జొన్న సొప్ప తిన్న కొద్ది సేపటికే ఒక్కొక్కటి చొప్పున 62 గొర్రెలు మృతి చెందాయి. ఇందులో నారాయణ నాయక్‌కు చెందిన 32, కుళ్లాయి నాయక్‌కు చెందిన 29 గొర్రెలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ వెంటనే అక్కడకు చేరుకుని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న 38 గొర్రెలకు అత్యవసర చికిత్స అందజేసి, కాపాడారు. గొర్రెలు మేసిన జొన్న సొప్పను పరిశీలించారు. సకాలంలో స్పందించి జీవాలను కాపాడిన డాక్టర్ నరేష్‌ను ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ వెంకటేష్‌తో పాటు ఉన్నతాధికారులు, గ్రామస్తులు అభినందించారు. గొర్రెల మృతితో రూ.8 లక్షల మేర నష్టపోయినట్లు కాపరులు వాపోయారు.



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న డాక్టర్ నరేష్, బాధిత కాపరులు

క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే హస్తకళలకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

అనంతపురం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నట్లు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని లేపాక్షి ఎంపోరియంను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళితో కలిసి సందర్శించారు. లేపాక్షి సిబ్బందికి పలు సూచనలు, సలహాలందించారు. హస్తకళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డును అందిస్తోందన్నారు. ఏపీ హెచ్‌డీసీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వృద్ధ హస్తకళాకారులకు ప్రతి నెలా రూ.500 పింఛన్ అందిస్తోందన్నారు. లేపాక్షి బొమ్మలను అందరూ కొనుగోలు చేసి హస్తకళాకారులను ప్రోత్సహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు, ముస్లిం సంఘం నాయకులు రాగిమాన్ చాంద్‌బాబా ఆలీ, సురేష్, కాటమయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.16 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.16 లక్షల ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,80,300 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,35,600 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

కమనీయం.. రుక్మిణీ కల్యాణం


రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్న చిన్నజీయర్ స్వామీజీ శిష్యబృందం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గీతామందిరంలో హైదరాబాద్ నుంచి విచ్చేసిన చిన్నజీయర్ స్వామీజీ శిష్యబృందం రుక్మిణీ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. గోపూజలు, విశ్వక్‌సేన ఆరాధనతో ఆరంభమైన కల్యాణోత్సవంలో ఎదుర్కోలు, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలను రుత్వికులు నిర్వహించి భక్తిభావాన్ని పెంచారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నాజీ అనుగ్రహభాషణంలో రుక్మిణీ కల్యాణం ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సాయిట్రస్టు అధినేత విజయ్‌సాయికుమార్, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు, ఉమాదేవి, నారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్వ నవమి


అలంకరణలో దేవతామూర్తులు

అనంతపురం కల్చరల్: త్రిమతాచార్యులలో ఒకరైన మధ్వాచార్యులు బదికావనం ప్రవేశం చేసిన రోజుగా ఆరాధనలందుకునే మధ్వనవమి వేడుకలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. పాతూరులోని వ్యాసరాజమఠం, మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం తదితర చోట్ల మధ్వనవమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం బృందావన సమేత లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, విశేష అభిషేకాలు, అర్చనలు, శ్రీగంధ పూజలు జరిగాయి. సర్వాంగసుందరంగా అలంకరించిన రథంపై స్వామిని భక్తిగీతాలు, ఆటపాటల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మధ్వాచార్యుల జీవిత విశేషాలను పండితులు వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో రఘునాథ్, కృష్ణారావు, సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



రామగిరి: మండలంలోని పేరూరులో ఆదివారం మధ్వజయంతి సందర్భంగా హనుమ, భీమ మధ్వ దేవస్థానంలో ఆలయ అర్చకుడు గండప్ప స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే స్వామిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సిద్ధం సభా ప్రాంగణం వద్ద ఆకట్టుకున్న ఫ్లెక్సీలు


అభిమానుల ఆనందోత్సాహం


సభా ప్రాంగణం వద్ద సిద్ధం బెలూన్లను ఎగురవేసిన దృశ్యం

సిద్ధం విజయవంతం

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- జై జగన్ నినాదాలతో దద్దరిల్లిన రాప్తాడు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం


రాప్తాడు వద్ద నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు తరలివస్తున్న జనం

రాప్తాడు/కనగానపల్లి/రామగిరి/ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'సిద్ధం' ఎన్నికల సన్నాహక సభకు జనం పోటెత్తారు. ఉత్సాహంతో పార్టీ శ్రేణులు తరలిరావడంతో ప్రసన్నాయపల్లి జంక్షన్, రామినేపల్లి జంక్షన్, కందుకూరు జంక్షన్, ధర్మవరం పంగల్ రోడ్డు జంక్షన్, గంగలకుంట రేల్వే గేటు వరకూ వాహనాలు నిలిచిపోయాయి. అటు బెంగళూరు 44వ జాతీయ రహదారి, ధర్మవరం, కదిరి జాతీయ రహదారులు వాహనాలతో నిండిపోయాయి. మధ్యాహ్నం 3:30 గంటల వరకు రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల నుంచి దాదాపు 52 నియోజకవర్గాల నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివిధ మార్గాల ద్వారా వచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి ఆధ్వర్యంలో వందలాది బస్సులు బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చారు. జాతీయ రహదారి ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఆకట్టుకున్నాయి. నాలుగు జిల్లాల నుంచి 'సిద్ధం' సభకు వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన ప్యాకెట్లు అందజేశారు. సిద్ధం సభా ప్రాంగణం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భారీ కటౌట్లు ఏర్పాట్లు చేశారు. సిద్ధం పేరుతో ఏర్పాటు చేసిన కటౌట్‌లు ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో రోడ్లు నిండిపోయాయి. సీఎం సభ ఎదురుగా ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు ఏర్పాటు చేసిన బెలూన్లు ఆకట్టుకున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌పై అభిమానంతో కార్యకర్తలు తమ చేతిపై సిద్ధం టాటూలు వేయించుకుని సందడి చేశారు.


జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు


వైఎస్సార్‌సీపీ జెండాలతో మహిళల కోలాహలం


ఆత్మకూరు: బస్సుపై డ్రమ్స్ వాయిస్తున్న యువత


కనగానపల్లి: సిద్ధం సభకు బయలుదేరిన ప్రజలు


రామగిరి: ఎంసీపల్లిలో నినాదాలు చేస్తున్న మహిళలు


రాప్తాడు: సిద్ధం కటౌట్ వద్ద సెల్ఫీ దిగుతున్న అభిమానులు


ఈలలు వేస్తూ.. డ్యాన్స్ చేస్తున్న దృశ్యం


జగన్ వెంటే మేమంతా: సిద్ధం కటౌట్‌తో సందడి చేస్తున్న నాయకులు


మళ్లీ జగనే సీఎం: మహిళల విజయకేతనం


ఆత్మకూరు మండలం నుంచి సిద్ధం సభకు తరలుతున్న నాయకులు, అభిమానులు


మామయ్యను గెలిపిద్దాం: వైఎస్సార్‌సీపీ జెండాతో వస్తున్న బాలలు

నీరు, ఆహారం ప్యాకెట్ల పంపిణీ


భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రమేష్‌గౌడ్

అనంతపురం ఎడ్యుకేషన్: 'సిద్ధం' సభకు హాజరైన అశేష జనవాహినికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలతో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్ అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాయలసీమ ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతి పేదవాడి సంక్షేమం, అభివృద్ధి కోరిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. 'సిద్ధం' సభకు తరలివచ్చిన లక్షలాదిమంది జనం చూస్తుంటే జగనన్న రేంజ్ ఎలాంటిదో మరోమారు అర్థమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా సోమశేఖరరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, హేమకిరణ్, హిదయతుల్లా, ఇర్షాద్, వెంకటేశ్, బెస్త వెంకటేశ్, ఆసిఫ్, దాదు, భాస్కర్, చంద్రాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

సభ వద్ద పటిష్ట భద్రత


సిద్ధం సభ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

రాప్తాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం సభకు లక్షలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు, నేతలు, అభిమానులు తరలివచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఒక వైపు ట్రాఫిక్ నియంత్రిస్తూనే మరో వైపు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ప్రజలతో మర్యాదగా మాట్లాడుతూ ఎక్కడా దురుసుగా ప్రవర్తించకుండా పోలీసు అధికారులు సిబ్బంది సంయమనంతో వ్యవహరించారు. ఏకంగా ఒక ఎస్పీ, 15 మంది అదనపు ఎస్పీలు, 29 మంది డీఎస్పీలతో పాటు సీఐ, ఆర్ఎస్ఐలు 114 మంది, ఎస్ఐ, ఆర్ఎస్ఐలు 296 మందితో కలుపుకుని హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, మహిళ పోలీసులు, హోంగార్డ్స్‌తో కలుపుకుని దాదాపుగా 5 వేల మంది నిత్యం పరిస్థితులను పర్యవేక్షిస్తూ బాధ్యతలను సమర్థవంతగా నిర్వర్తించారు. సుమారుగా 100కు పైగా డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి, వాటిలో నుంచి లోపలికి వెళ్లేలా ఏర్పాటు చేశారు. ప్రాంగణం వెలుపల ప్రత్యేకంగా పోలీస్ హెల్ప్ డెస్క్ సైతం ఏర్పాటు చేశారు.

ఉచితంగా వైద్య సేవలు


సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తిని వైద్య శిబిరం వద్దకు తీసుకెళ్తున్న నాయకులు


రాప్తాడు సిద్ధం సభా ప్రాంగణంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: రాప్తాడు వద్ద జరిగిన సిద్ధం సభలో ప్రత్యేకంగా రెండు హెల్త్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. సభకు తరలివచ్చిన ప్రజలకు సేవలందించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అన్ని రకాల మందులు, ప్రాథమిక వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అక్కడ తమ ఆరోగ్య పరిస్థితిని చెక్ చేయించుకుని మందులు తీసుకున్నారు. ప్రజల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిత్యం తపిస్తారనేందుకు ఇది నిదర్శమని పలువురు కొనియాడారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి ప్రజలకు లక్షల సంఖ్యలో మజ్జిగ ప్యాకెట్లను వైఎస్సార్‌సీపీ నాయకులు అందుబాటులో ఉంచారు. పలువురు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

కార్యకర్తకు గాయాలు

రాప్తాడు: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభ వద్ద అపశ్రుతి చోటు చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ముగలిచెట్ల తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరమణ నాయక్ సిద్ధం సభకు వచ్చాడు. సభ ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరే క్రమంలో బస్సు కిందపడటంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్య కోసం తిరుపతికి రెఫర్ చేసినట్లు సమాచారం

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మాఘ శుద్ధ నవమి ఆదివారం రాత్రి స్వామిని పెళ్లికుమారుడిగా ముస్తాబు చేసి జక్కలచెరువు గ్రామం నుంచి తొండపాడు గ్రామానికి పల్లకి సేవలో ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు తీర్చారు. ఈ సందర్భంగా జక్కలచెరువు గ్రామంలో రంగనాథ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.